

పర్మిషన్లు లేకుండానే..
నగరంలోని వస్త్ర షోరూం నిర్వాహకులకు అగ్నిమాపక శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు.
- 8లో ▸



డీఎస్ స్మారక క్రీడలు..
క్రీడాకారులను ప్రోత్సహించడానికి డీఎస్ పేరుతో పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.0 /23.4

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

డెంగీతో యువతి మృతి



పరమేశ్వరి(ఫైల్)

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండలం కేశాపూర్ గ్రామానికి చెందిన పరమేశ్వరి(18) డెంగీతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన అనూష, రమేష్‌లకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె పరమేశ్వరి ఇటీవల తన తాతయ్య దగ్గరికి డిచ్‌పల్లి మండలం రాంపూర్ వెళ్లింది. అక్కడ ఉండగా ఆమెకు జ్వరం వచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వారం రోజులుగా చికిత్స పొందుతోంది. బుధవారం రక్తకణాలు పడిపోవడంతో పరిస్థితి విషమించి చనిపోయింది.

యోగా ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలకు పరీక్ష



నిజామాబాద్ నాగారం: ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో హెల్త్ సెంటర్‌ల పరిధిలో ఉన్న యోగా సెంటర్లలో ఇన్‌స్ట్రక్టర్ల నియామకాల కోసం బుధవారం పరీక్షలు నిర్వహించారు. ఆయుష్ అడిషనల్ డైరెక్టర్ లింగరాజు, ఆర్‌డీడీ ప్రమీలదేవి ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో నియామక ప్రక్రియ నిర్వహించారు. యోగా డాక్టర్ల సమక్షంలో దరఖాస్తు చేసుకున్న వారితో యోగాసనాలు వేయించారు. ఉమ్మడి జిల్లాలో 32 సెంటర్లు ఉండగా ఒక్కో యోగా కేంద్రంలో మగ, మహిళ చొప్పున ఇద్దరిని ఎంపిక చేయనున్నారు. ఈ ఎంపికలకు సుమారు 500మంది హాజరు అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా ఇన్‌చార్జి నారాయణరావు, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, యోగా వైద్యులు తిరుపతి, దేవయ్య, డీపీవోలు వందన, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలోకి తగ్గిన నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో గోదావరిలోకి నీటి విడుదలను అధికారులు తగ్గించారు. రెండు వరద గేట్ల ద్వారా 6,248 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్‌లోకి 33,238 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కాకతీయ కాలువ ద్వారా 6,800 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 18 వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువ ద్వారా 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 709 క్యూసెక్కులు మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి అంతేస్థాయి నీటి మట్టంతో నిండుకుండలా ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

నిజాంసాగర్‌లోకి 14 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో బుధవారం సాయంత్రం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 14 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు డీఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా 14 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా బుధవారం సాయంత్రానికి 1,404.96 అడుగుల (17.744 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

2008 డీఎస్సీ బీఈడీ అభ్యర్థులకు శుభవార్త

నిజామాబాద్ అర్బన్: డీఎస్సీ 2008లో డీఈడీ అభ్యర్థులకు అవకాశం ఇవ్వడంతో ఉద్యోగం కోల్పోయిన 30శాతం బీఈడీ అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వీరిని కాంట్రాక్టు పద్ధతిలో నియమించాలని నిర్ణయించింది. 2008 డీఎస్సీలో బీఈడీ అభ్యర్థులను ఎంపిక చేసిన తర్వాత 30 శాతం పోస్టులను డీఎడ్ వారికి ఇవ్వాలని మధ్యంతర ఉత్తర్వులు వచ్చాయి. దీంతో బీఈడీ అభ్యర్థులకు ఉద్యోగాలకు దూరమయ్యారు. అప్పటి నుంచి వారు న్యాయపోరాటం చేస్తున్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం వారిని కాంట్రాక్టర్ పద్ధతిలో నియమించాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలో 220 మంది బీఈడీ అభ్యర్థులకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు నిర్ధారించారు. దీనికి సంబంధించిన పూర్తిస్థాయి నిబంధనలు ఇంకా రాలేదని అధికారులు పేర్కొన్నారు.



నిజామాబాద్ శివారు మల్లారం వద్ద అక్రమ తవ్వకాలు

తవ్వుకో.. అమ్ముకో!

'తవ్వుకున్నోడికి తవ్వుకున్నంత' చందంగా మారిపోయింది జిల్లాలో అక్రమ మొరం దందా.. విచ్చల విడిగా మొరం కొల్లగొడుతున్న అక్రమార్కులు రూ. కోట్లు దండుకుంటున్నారు. వీరికి అనుకూలంగా వ్యవహరించే అధికారుల జేబులూ నిండుతున్నాయి. మరోవైపు అనుమతులు ఉన్న క్వారీలకు అడ్డంకులు కల్పించడంతో అవి మూతపడుతున్నాయి. దీంతో ఫీజులు, రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం గండి పడుతోంది. కాగా అక్రమ మొరం దందాలో కొందరు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల పేర్లు వినిపించడం కొసమెరుపు..

- జిల్లా వ్యాప్తంగా ఇష్టారాజ్యంగా మొరం అక్రమ తవ్వకాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్న అక్రమార్కులు
- మూడేళ్లుగా రెగ్యులర్, తాత్కాలిక క్వారీలకు అనుమతులు లేవు
- మైనింగ్ కార్యాలయంలో మరుగున పడ్డ 50 క్వారీలకు పైగా దరఖాస్తులు
- మరోవైపు అనుమతులు ఉన్న క్వారీలను నిలిపేసిన వైనం



ఊట్‌పల్లి వద్ద అనుమతి ఉన్న క్వారీ మూతపడగా దానికి సమీపంలో అక్రమంగా మొరం తరలిస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్లా విచ్చలవిడిగా మొరం అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రతిరోజూ వేలాది ట్రిప్పుల మొరం రవాణా అవుతోంది. అయితే ప్రభుత్వానికి మాత్రం పిసరంత ఆదాయం రావడం లేదు. అక్రమంగా తవ్వకాలు చేస్తున్నవాళ్లేమో కోట్లాది రూపాయలు దండుకుంటున్నారు. అధికారులు సైతం తమ జేబులు నింపుకుని సంబరపడుతుండడం విశేషం. కళ్లముందే నిరంతరం అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు మామూళ్లు తీసుకుని తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. కాగా అక్రమ తవ్వ కం దారులు మొరం అవసరమైనవారికి ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్నారు. ఒక్క ట్రిప్పు మొరంకు కనీస ధర రూ.3 వేలు వసూలు చేస్తున్నారు. దూరం పెరిగితే ధర కూడా అంతకంతకూ పెరుగుతూ పోతుంది. జిల్లాలోని ప్రతి మండలంలో రెండు నుంచి మూడు మొరం క్వారీలు అక్రమంగా నడుస్తున్నాయి. నిజామాబాద్ నగరానికి అనుకుని ఉన్న మండలాల్లో అర్ధరాత్రి అక్రమంగా భారీగా తవ్వకాలు చేసి అమ్ముకుంటున్నారు. ఇలా తవ్వుకుంటున్న వారిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులూ ఉండడం గమనార్హం.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

అక్రమ మొరం తవ్వకాల కారణంగా ప్రభుత్వ ఆదాయం గుండుసున్నా అయింది. ప్రభుత్వ ఫీజు లు, రాయల్టీలు చెల్లించకుండానే అక్రమంగా తవ్వకాలు చేస్తున్న ప్రబుద్ధులు వినియోగదారులకు మాత్రం భారీ ధరలకు అమ్ముకుంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లా వ్యాప్తంగా మొరం తవ్వకాల అనుమతుల కోసం గత మూడేళ్ల కాలంలో 50 క్వారీలకు పైగా దరఖాస్తులు గనుల శాఖకు వచ్చాయి. ప్రభు త్వం నుంచి పాలసీ రాకపోవడంతో అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో సదరు దరఖాస్తులన్నీ జిల్లా మైనింగ్ కార్యాలయంలో మూలుగుతున్నాయి. తాత్కాలిక అనుమతులు సైతం ఇవ్వడం లేదు. దీంతో అక్రమ తవ్వకందారుల దందా మూడు పువ్వు లు.. ఆరుకాయలు అన్నచందంగా సాగిపోతోంది. ప్రభుత్వ ఫీజులు, రాయల్టీలు చెల్లించే పనిలేదు. వే బిల్లులతో అవసరం లేదు. దీంతో అక్రమ తవ్వకాలకు రాజమార్గం లభించినట్లైంది. తవ్వకున్నోడికి తవ్వకున్నంత అన్నమాదిరిగా మొరంను పెద్ద ఎత్తున కొల్లగొడుతూ కాసులు దండుకుంటున్నారు.

అనుమతులు ఉన్నవి నాలుగే..

జిల్లాలో అనుమతులు ఉన్నది నాలుగు క్వారీలకు మాత్రమే. మాక్లూర్ మండలం చిన్నాపూర్, ఎడపల్లి మండలం జానకంపేట, ఆర్మూర్ మండలం పిప్రి, బోధన్ మండలం ఊట్‌పల్లి మొరం క్వారీలకు మాత్రమే అనుమతులు ఉన్నాయి. మోపాల్ మండలంలోని సిర్‌పూర్ క్వారీకి అనుమతులు ఉన్నప్పటికీ అక్కడ మొరం అయిపోయింది. దీని సమీపంలోనే అక్రమంగా మొరం తవ్వకాలు నడుస్తున్నాయి. ఓ సీనియర్ కాంగ్రెస్ నాయకుడి గోదాం నిర్మాణానికి మొరం తరలిస్తున్నారు.

- నిజామాబాద్ నగర శివార్లలోని మల్లారం వద్ద అర్ధరాత్రి విచ్చలవిడిగా మొరం తవ్వుతున్నారు. అదేవిధంగా నగర సమీపంలోని మల్కాపూర్(ఏ), శాస్త్రినగర్‌లలో అక్రమ తవ్వకాల కు అడ్డనేదే లేకుండా పోయింది. ఎడపల్లి వద్ద మొ రం అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. జిల్లాలోని ప్రతి మండలంలో అక్రమ తవ్వకాలు చేసి రవాణా చేస్తున్నారు.
- చిన్నాపూర్, జానకంపేట, పిప్రి మొరం క్వారీలు నడుస్తుండగా, బోధన్ మండలం ఊట్‌పల్లి మొరం క్వారీ మాత్రం నడవడం లేదు. ప్రభుత్వ ఫీజు కట్టి రాయల్టీ చెల్లిస్తున్న ఈ ఊట్‌పల్లి క్వారీని నిలిపేసే పరిస్థితి రావడం గమనార్హం. కాగా ఊట్‌పల్లి క్వారీకి సమీపంలోనే కొందరు అక్రమంగా పెద్ద ఎత్తున మొరం తవ్వకాలు జరుపుతున్నా ప్రభుత్వ యంత్రాంగం మాత్రం పట్టనట్లు ఉంటోంది. అలాగే అనుమతులు ఉన్న నాలుగు క్వారీల్లో ఊట్‌పల్లి క్వారీని నడిపించే విషయంలో అధికారులు చొరవ తీసుకోకపోవడంతో ప్రభుత్వ రాయల్టీకి గండి పడింది. ఊట్‌పల్లి మొరం క్వారీకి 2027 ఆగస్టు 7 వరకు అనుమతుల విషయమై కాలపరిమితి ఉంది. అయినప్పటికీ ఈ క్వారీ నడవడం లేదు. అక్రమ తవ్వకాల విషయమై జిల్లా గనుల శాఖ ఏడీ విజయ్‌కుమార్ రాథోడ్‌ను 'సాక్షి' వివరణ కోరగా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్య కళాశాల కోసం ఎంతో కష్టపడ్డా..



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, చిత్రంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

- వైఎస్సార్ ఆరోగ్య శాఖ మంత్రి పదవి ఇవ్వడంతో కల నెరవేరింది
- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- కాలేజీలో ఫెస్ట్ ప్రారంభం

నిజామాబాద్ నాగారం: జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు కోసం ఎంతో కష్టపడ్డానని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తనను ఆరోగ్య శాఖ మంత్రిగా చేయడంతో మెడికల్ కాలేజీ కల నెరవేరిందన్నారు. నగరంలోని మెడికల్ కాలేజీలో బుధవారం 11వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. మెడికల్ కళాశాల మంజూరు కోసం చాలా తిరిగానని, ఉమ్మడి రాష్ట్రంలో రెండు మంజూరు చేస్తే ఒకటి ఆంధ్రకు, మరొకటి మన నిజామాబాద్‌కు మంజూరు చేయించానని చెప్పారు. త్వరలో కళాశాల ఆవరణలో జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. క్రీడా మైదానానికి కృషి చేస్తానని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌ను వేరే ప్రాంతానికి తరలిస్తామన్నారు. మెడిసిన్ చదువుకుని పేదలకు నిస్వార్థంగా సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శివప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, ప్రొఫెసర్లు నాగమోహన్, జలగం తిరుపతిరావు, విజయ్, నాగరాజు, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేష్‌రెడ్డి, భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు పోటీలు

ఖలీల్‌వాడి: విధి నిర్వహణలో సామర్థ్యం పెంచడానికి పోలీసులకు బుధవారం పలు రకాల పోటీలు నిర్వహించినట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. నగరంలోని కమిషరేట్ కార్యాలయంలో కానిస్టేబుల్ నుంచి ఏసీపీ వరకు పోటీలు నిర్వహించారు. సైంటిఫిక్, ఫింగర్ ప్రింట్ ఇన్వెస్టిగేషన్ కోసం ఎంపికలో భాగంగా క్లూస్ ఏ విధంగా సేకరించాలని పరీక్షలు నిర్వహించినట్లు సీపీ తెలిపారు. ఈ పోటీలతో పోలీసుల్లో ఇన్వెస్టిగేషన్ స్థాయి పెరుగుతుందన్నారు.



ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయిలో జరిగే డ్యూటీ మీట్ కార్యక్రమానికి పంపుతామని తెలిపారు. అదనపు డీసీపీ (అడ్మిన్) కోటేశ్వరరావు, సీసీఎస్ ఏసీపీ నాగవేంద్ర చారీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్ అర్బన్: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశం జరిగింది. పోలీస్, రవాణా, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల సంస్థ, జిల్లా వైద్యారోగ్య శాఖ, ఆర్టీసీ, రెడ్ క్రాస్ ప్రతినిధులు పాల్గొని రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్లుగా పరిగణిస్తూ, ప్రమాదాలకు దారి తీస్తున్న కారణాలను గుర్తించాలన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇప్పటికే కొన్ని బ్లాక్ స్పాట్ల వద్ద చర్యలు తీసుకున్న ఫలితంగా జూన్ నెల నుంచి చూస్తే కొంతవరకు రోడ్డు ప్రమాదాలు తగ్గాయన్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాన రహదారులపై ధాన్యం, మొక్కజొన్న ఆరబెడుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నందున రైతులకు అవగాహన కల్పించాలని, వారికి డ్రై ప్లాట్ ఫారంలను విరివిగా మంజూరు చేయాలని కమిటీ సభ్యులు సూచించారు. నగరంలో వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను గుర్తించాల్సిన ఆవశ్యకత ఉందని సభ్యులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో రెడ్ క్రాస్ ప్రతినిధి బుస్సా ఆంజనేయులు పాల్గొన్నారు.

'మున్సిపల్'లో ప్లాస్టిక్ వాడొద్దు

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఇక నుంచి సిబ్బంది ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు వాడొద్దని మున్సిపల్ కమిషనర్ మంద మకరందు సూచించారు. కార్యాలయానికి వచ్చేవారు సైతం ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలన్నా రు. బుధవారం జిల్లా కేంద్రంలోని బల్దియా కార్యాలయంలో కమిషనర్ ఉద్యోగులు, సిబ్బందితో ప్ర తిజ్ఞ చేయించారు. 'స్వచ్ఛతా హి సేవా'లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఎవరికి వారు బాధ్యతతో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. జనపనార, బట్టతో తయారుచేసిన చేతి సంచులను వాడి పర్యావరణ పరిరక్షణలో భాగస్వా మ్యం కావాలన్నారు. నూరుశాతం ప్లాస్టిక్‌ను నిషేధించిన సిబ్బందికి ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు కమిషనర్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ.. మెప్మా సిబ్బంది ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జనార్దన్, సిబ్బంది పాల్గొన్నారు.



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ మకరందు

మింగేసిన డబ్బుల రికవరీ ఎప్పుడు?

- మాక్లూర్ సొసైటీ మహాజన సభలో చైర్మన్‌ను నిలదీసిన రైతులు
- మాజీ చైర్‌పర్సన్ గోపు లక్ష్మి హాజరు కాకపోవడంపై ఆగ్రహం

మాక్లూర్: పదవిని అడ్డు పెట్టుకొని సొసైటీని దివాలా తీసిన మాజీ చైర్‌పర్సన్ గోపు లక్ష్మి లేకుండా మహాజన సభ ఎలా నిర్వహిస్తారని రైతులు చైర్మన్ బూరోల్ల అశోక్‌ను నిలదీశారు. బుధవారం మాక్లూర్ వ్యవసాయ పరపతి సంఘంలో చైర్మన్ అధ్యక్షతన మహాజన సభ జరిగింది. సభ ప్రారంభంతోటే సీఈవో ప్రవీణ్ లావాదేవీలను చదివి విన్పిస్తుండగా అక్రమాలకు పాల్పడిన గోపు లక్ష్మి విషయం చర్చకు తెచ్చారు. అవినీతి ఆరోపణలతో పదవి నుంచి తొలిగిపోయినా లక్ష్మి డైరెక్టర్‌గా హాజరు కావాల్సి ఉండగా ఇప్పటికి రెండు పర్యాయాలు మహాజన సభ జరిగినా హాజరు కాకపోవటంలో ఆంతర్యమేమిటని రైతులు ప్రశ్నించారు. చైర్‌పర్సన్ లక్ష్మి హయాంలో భారీ ఎత్తున అవినీతి జరిగితే సభలో ప్రస్తావన లేకుండా చేయడంపై వారు మండిపడ్డారు. ఆమె ఎరువులను ఇతర మండలాల్లో విక్రయించుకోవటమే కాకుండా రూ.కోటికి పైగా అవినీతి చేసిందని ఆ డబ్బులను ఎప్పుడు రికవరి చేస్తారో చెప్పాలన్నారు. నెల రోజుల్లో రికవరి చేయటానికి ప్రయత్నిస్తున్నామని సీఈవో వెల్లడించారు. కొందరు డైరెక్టర్లు సొంతగా తీసుకున్న డబ్బులను ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. సదరు డైరెక్టర్లు డిసెంబర్ నాటికి చెల్లిస్తామని హామీ ఇచ్చారు. నెల తర్వాత మహాజన సభ ఏర్పాటు చేసి సొసైటీలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతును ఆహ్వానించి నిర్ణయాలు తీసుకోవాలని రైతులు కోరారు. మాజీ చైర్మన్ కొట్టాల లింగారవు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ గుండారం శేఖర్, డైరెక్టర్లు కాశీనాథ్‌రావు, అంజునాయక్, జిట్టా చిన్నా గంగాధర్, రవి ప్రకాష్ పాల్గొన్నారు.



మహాజన సభలో సొసైటీ చైర్మన్‌ను నిలదీస్తున్న రైతులు

నిఘా నీడలో కామారెడ్డి

- పోలీసులపై రాళ్ల దాడిని తీవ్రంగా పరిగణిస్తున్న ఉన్నతాధికారులు
- పరిస్థితి అదుపు తప్పకుండా జాగ్రత్తలు



పట్టణంలో బందోబస్తుకు చుట్టుపక్కల జిల్లాలనుంచి తరలివచ్చిన పోలీసులు

కామారెడ్డి క్రైం : కామారెడ్డిలోని జీవదాన్ పాఠశాలలో ఆరేళ్ల బాలికతో ఓ వ్యాయామ ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆరోపిస్తూ బాలిక కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు పెట్టి, అరెస్టు చేశారు. ఈ సంఘటన వెలుగులోకి రావడంతో నిందితుడితో పాటు, పాఠశాల యాజమాన్యం, విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకులు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ సహా పలువురు నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం పాఠశాల వద్ద ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆందోళనకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో పట్టణ సీఐ, ఎస్సై సహా పలువురు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే ఆందోళనకారులు బుధవారం మళ్లీ పెద్ద ఎత్తున నిరసనలకు దిగవచ్చన్న అనుమానంతో పోలీస్‌శాఖ అప్రమత్తమైంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు చుట్టు పక్కల జిల్లాలకు చెందిన డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, వందల సంఖ్యలో సిబ్బందిని రప్పించి పట్టణంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణం పూర్తిగా పోలీసు నిఘాలో ఉంది.

దాడులకు పాల్పడితే ఉపేక్షించబోం

కామారెడ్డి క్రైం: దాడులు, అల్లర్లకు కారణమయ్యే వారిని ఉపేక్షించేది లేదని ఎస్పీ సింధు శర్మ హెచ్చరించారు. పోలీసులపై దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని జీవదాన్ పాఠశాలలో బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన పీఈటీ నాగరాజుపై ఆమె తల్లిదండ్రులు ఈనెల 23 న ఫిర్యాదు చేశారని, అదేరోజు పోక్సో కేసు పెట్టి నిందితుడిని అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామన్నారు. జీవదాన్ పాఠశాల వద్ద మంగళవారం పోలీసులపై జరిగిన రాళ్ల దాడి ఘటనలో పలువురు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. దాడి చేసిన వారిని ఉపేక్షించబోమన్నారు.

కేసులు నమోదు..

పీఈటీ నాగరాజుపై పోలీసులు సోమవారమే కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. అయినా కొందరు ఉద్దేశపూర్వకంగా గొడవ సృష్టించి పరిస్థితి అదుపు తప్పేలా చేశారని పోలీసులు భావిస్తున్నారు. దాడులకు పాల్పడినవారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ సింధు శర్మ స్పష్టం చేశారు. పాఠశాలతోపాటు పోలీసులపై దాడులకు సంబంధించి ఇప్పటికే రెండు కేసులు నమోదు చేశారు. అనుమానం ఉన్న ప్రతి ఒక్కరినీ ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నారు. పట్టణంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ఎస్పీ సింధు శర్మ ఆధ్వర్యంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా బుధవారం కామారెడ్డి డీఎస్పీ కార్యాలయానికి అన్ని మతాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులను పిలిపించి సమావేశాలు ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

రేపు రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల ధర్నా



బాన్సువాడ : ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం (27న) రోజున నిజామాబాద్‌లోని పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు రిటైర్డ్ కార్మికుల సంఘం కార్యదర్శి శంకర్ తెలిపారు. పట్టణంలోని డిపో సమీపంలో బుధవారం రిటైర్డ్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ యజమాన్యం రిటైర్డ్ కార్మికులకు 2017 పే స్కేల్ ఏరియర్స్ ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం ఈపీఎస్ 95 జీవో ప్రకారం మినిమమ్ పెన్షన్‌ను డీఏతో కలిసి రూ.7500 చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం నిజామాబాద్ పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని, కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో రిటైర్డ్ కార్మిక సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటీవ్ మెంబర్ నారాయణ, ఏశయ్య, బాన్సువాడ అధ్యక్షుడు కౌసర్, సభ్యులు ఫరీద్, మహమూద్, నాగనాథ్, పండరి, సిరాజ్, పీరయ్య, ప్రభు పాల్గొన్నారు.

అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలి

- అవయవదాతల సంఘం వినతి



బోధన్: అవయవదాతల అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించేందుకు కర్నాటక, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వాలు జీవోలు జారీ చేశాయని శరీర అవయదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి తెలిపారు. మన రాష్ట్రంలో సైతం జీవో జారీ చేసేలా కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, సంఘం ప్రతినిధులతో కలిసి బుధవారం జిల్లా కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని భారతి తెలిపారు. కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, సంఘ ప్రతినిధులు బాల గంగాధర్, మంజులారాణి పాల్గొన్నారు.

పర్మిషన్లు లేకుండానే ప్రారంభానికి..

- వస్త్ర షోరూమ్‌కు తాజాగా అగ్నిమాపకశాఖ నోటీసు
- అభ్యంతరాలు లేవనెత్తిన బల్దియా, ఫైర్ అధికారులు
- ప్రారంభోత్సవ కార్యక్రమానికి పోలీసుశాఖ గ్రీన్ సిగ్నల్?

ఖలీల్‌వాడి: పర్మిషన్లు లేకుండానే జిల్లా కేంద్రంలో వస్త్ర షోరూం ప్రారంభానికి సిద్ధమైంది. భారీ భవన నిర్మాణం అక్రమమని ఇప్పటికే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తేల్చి నోటీసులు అందజేయగా, అగ్ని మాపకశాఖ అధికారులు బుధవారం నోటీసు అందజేశారు. ఇదిలా ఉండగా, గురువారం షోరూం ప్రారంభోత్సం కోసం నిర్వాహకులు పోలీసు శాఖ అనుమతి కోరడం కొసమెరుపు. వారి దరఖాస్తును పరిశీలించిన ఏసీపీ.. పరిశీలించాల్సిందిగా ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబుకు పంపించారు. అయితే, ఎస్‌హెచ్‌వో మాత్రం భవన ప్రారంభోత్సవానికి అనుమతి ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించని షో రూమ్‌కు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి గౌతమ్ ఆదేశాల మేరకు బుధవారం సంబంధిత అధికారులు నోటీసు జారీ చేశారు. అధికారులు భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారి నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటించని వస్త్ర షోరూమ్ కి నోటీసులు జారీ చేశామన్నారు. షోరూంకి కనీసం సెట్ బ్యాక్ లేదని, అలాగే కొన్ని నిబంధనలను పాటించ లేదన్నారు. నోటీసు ఇచ్చిన 30 రోజుల్లో అగ్నిమాపక శాఖ అనుమతితోపాటు పూర్తి నిబంధనలు పాటించని పక్షంలో రెండో నోటీసు జారీ చేస్తామని తెలిపారు.



నోటీసు అందజేస్తున్న ఫైర్ అధికారులు



సినీ నటి రాక సందర్భంగా పోలీసుల అనుమతి కోసం..

వస్త్ర షోరూమ్ ప్రారంభించేందుకు సినీ నటిని ఆహ్వానించిన నిర్వాహకులు పోలీసుశాఖ అనుమతి కోసం ఏసీపీ రాజావెంకట్‌రెడ్డికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించాల్సిందిగా ఏసీపీ.. ఒకటో టౌన్ ఎస్ హెచ్ వో విజయ్‌బాబుకు పంపించారు.

ఇరుకుగా ఉన్న రాష్ట్రపతి రోడ్డులో ఇంత భవనం నిర్మిస్తారా? అని ప్రజలు పెదవి విరుస్తున్నారు. దగ్గరలోనే జీజీహెచ్, ఖలీల్‌వాడిలోని ఆస్పత్రులున్నాయని, పేషెంట్లకు ఇబ్బందులు తప్పవని అంటున్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని గతంలో ఢిల్లీవాలా స్వీట్ హోం వద్ద తనిఖీలు చేపట్టి, ట్రాఫిక్ క్లియర్ చేసిన పోలీసులు ఇప్పుడు వస్త్ర షోరూమ్‌కు అనుమతి ఇస్తారా? రాష్ట్రపతి రోడ్డులోనే ఒకరికి ఓ న్యాయం.. మరొకరికి మరో న్యాయమా అని చర్చించుకుంటున్నారు.

డీఎస్ స్మారక క్రీడల నిర్వహణ అభినందనీయం



కార్యక్రమంలో క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన మిత్రుడు ధర్మపురి శ్రీనివాస్(డీఎస్) పేరుతో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా పాత కలెక్టరేట్ మైదానంలో క్రీడాపోటీలు కొనసాగుతుండగా, బుధవారం నాటి కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. వాలీబాల్, ఖోఖో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్టేడియాల నిర్మాణానికి కృషి చేస్తున్నదన్నారు. నూతన స్టేడియం నిర్మాణానికి ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నగేశ్‌రెడ్డి, భక్తవత్సలం, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు వేణురాజ్, నిర్వాహకులు సాయిలు, పీడీ విద్యాసాగర్, పీఈటీలు పాల్గొన్నారు.

సంస్థ ఆదాయం పెంచాలి

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ -2 డిపోను ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) మునిశేఖర్ బుధవారం తనిఖీ చేశారు. అనంతరం డిపో-1ను సందర్శించారు. డిపోలో కొనసాగుతున్న ఆరోగ్య శిబిరాన్ని పరిశీలించారు. రీజినల్ మేనేజర్ కార్యాలయంలో డిపోల వారీగా సమీక్షించారు. రీజియన్ పరిధిలో ఆర్టీసీకి ఆదాయం పెంచాలని, ఇందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు ఆయన సలహాలు, సూచనలు చేశారు.



అధికారులతో మాట్లాడుతున్న ఈడీ మునిశేఖర్

28న ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల విభాగంలో రెజ్లింగ్ ఎంపికలను ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి నాగమణి బుధవారం ప్రకటనలో తెలిపారు. మోపాల్ మండలంలోని మంచిప్పలో శనివారం ఉదయం 9గంటలకు ఎంపికలు ఉంటాయన్నారు, ఒక స్కూల్ నుంచి ఒక్కో వెయిట్ కేటగిరిలో ఒక విద్యార్థి మాత్రమే పాల్గొనవచ్చని పేర్కొన్నారు. తమ వెంట బోనాఫైడ్ తీసుకురావాలని సూచించారు. అండర్ - 14 ఎంపికలో పాల్గొనే బాలురు, బాలికలు 1 జనవరి 2011 లేదా ఆ తరువాత జన్మించిన వారై ఉండాలని, 6వ ఆపై తరగతులు చదువుతున్న వారు అర్హులున్నారు. అండర్ - 17 ఎంపికలో పాల్గొనే వారు 1 జనవరి 2008 లేదా ఆ తరువాత జన్మించిన వారై, 6వ తరగతి, పై తరగతి అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం సంతోషి (78937 32228), దేవేందర్ (95503 58444) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అండర్-17 ఫుట్‌బాల్ ఎంపికలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిజామాబాద్ ఆధ్వర్యంలో అండర్ - 17 బాల, బాలికల ఫుట్‌బాల్ ఎంపికలను ఈ నెల 28న నగరంలోని రాజారాం స్టేడియంలో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1జనవరి 2008 లేదా ఆ తరువాత జన్మించినవారై, 6వ తరగతి లేదా పైతరగతుల విద్యార్థులు అర్హులన్నారు. ఎంపికకు హాజరయ్యే వారు తమ వెంట బోనాఫైడ్ తీసుకురావాలని సూచించారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్..

అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న ఉదయం 10 గంటలకు నాగారంలోని రాజారాం స్టేడియంలో అండర్ 14 ,16, 18, 20 బాలబాలికలకు జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు నరాల రత్నాకర్, రాజాగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులు మాత్రమే ఎంపికలో పాల్గొనే అవకాశం ఉంటుందని, అండర్ - 14, 16 బాల బాలికలకు వేర్వేరుగా స్కూల్ చాంపియన్‌షిప్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను హన్మకొండ జిల్లాలో అక్టోబర్ 7, 8 వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌కు పంపించనున్నట్లు తెలిపారు. పేర్ల రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 99890 40776 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జీజీహెచ్‌లో ఘనంగా ఫార్మసిస్ట్ డే



నిజామాబాద్‌నాగారం: జిల్లా ఆస్పత్రి ఆయూష్ విభాగం ఫార్మసిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫార్మసిస్ట్ డేను జీజీహెచ్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయూష్ అడిషనల్ డైరెక్టర్ హోమియో పతి వైద్యుడు లింగరాజు, ఆయూష్ విభాగం వరంగల్ ఆర్‌డీడీ డాక్టర్ ప్రమీలాదేవి కేక్ కట్ చేసి శుభా కాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయూష్ విభాగం ఫార్మసిస్ట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి న్యావనంది పురుషోత్తం, నిజామాబాద్ జిల్లా ఆయూష్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ నారాయణ్‌రావు, కామారెడ్డి ఇన్‌చార్జి వెంకటేశ్, డీపీఎంలు, వైద్యులు, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

రుద్రూర్: డెలివరీ కోసం ఆస్పత్రికి తీసుకెళ్తున్న గర్భిణీ 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. కోటగిరి మండలం సుద్దులం గ్రామానికి చెందిన సాత్వికకు పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు 108 కు సమాచారం అందించారు. ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువై ఎక్లాస్‌పూర్ క్యాంపు ప్రాంతంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది గంగారాం, ఖలీంపాషా తల్లీబిడ్డను కోటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చారు.



'సహకారం'పై అవగాహన కల్పించాలి



ఖలీల్‌వాడి: రైతులకు, ప్రజలకు సహకార సంఘాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత నేషనల్ కో ఆపరేటీవ్ యూనియన్ తీసుకోవాలని, దీనికి రాష్ట్ర కో ఆపరేటీవ్ యూనియన్లు సహకరిస్తేనే గ్రామాల్లో మనుగడ ఉంటుందని రాష్ట్ర సహకార కో ఆపరేటీవ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలోని నేషనల్ కో ఆపరేటీవ్ యూనియన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దిలీప్ సంఘానే ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో నిర్వహించిన ఎన్‌సీయూఐ వార్షిక మహాజన సభలో మోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. సహకార సంఘానికి సభ్యులకు మధ్య ఉన్న భారీ అగాధాన్ని పూడ్చే విధంగా ప్రజలు, రైతులు సహకార సంఘం అంటే మాది అని అనుకోవాలన్నారు. సహకార ఉద్యమాన్ని మరో జాతీయ ఉద్యమంగా మలిచే విధంగా జాతీయ కోపరేటీవ్ యూనియన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

ద్వితీయ స్థానంలో ఒకటో ఠాణా



ఖలీల్‌వాడి: రాష్ట్రస్థాయి బెస్ట్ రిసెప్షన్ ఆఫీసర్లలో నిజామాబాద్ నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ద్వితీయస్థానంలో నిలిచింది. మహిళా కానిస్టుబుల్ రజిని మేనేజ్‌మెంట్ సిస్టం(సీసీటీఎన్‌ఎస్)లో అత్యుత్తమ ప్రతిభకనబరిచి జూలై, ఆగస్టు నెలల్లో బెస్ట్ ప్రొఫార్మర్‌గా నిలిచారు. డీజీపీ జితేందర్ చేతుల మీదుగా బుధవారం హైదరాబాద్‌లో ఆమె అప్రిసియేషన్ సర్టిఫికెట్ తీసుకున్నారు.

క్రమశిక్షణతో మెలగాలి



ఖలీల్‌వాడి: హైదరాబాద్‌లో ఏడాదికాలంపాటు శిక్షణ పూర్తి చేసుకొన్న బాసర జోన్- 2 పరిధిలోని ఎనిమిది మంది ట్రెయినీ ఎస్సైలు సీపీ కల్మేశ్వర్‌ను కార్యాలయంలో బుధవారం కలిసి రిపోర్టు చేశారు. సీపీకి వారు పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సిబ్బంది ఎల్లప్పుడూ క్రమశిక్షణతో మెలగాలని, తమ పైస్థాయి అధికారుల సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఫిర్యాదులు వచ్చిన వెంటనే త్వరితగతిన స్పందించాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలు ఎస్.శ్రీనివాస్, పి.రాజేశ్వర్, కె.కిరణ్‌పాల్, కె.శైలెందర్, జెడ్.సుస్మిత, ఎం.రమ, జె.సుహాసిని, ఎం.కళ్యాణి ఉన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) కోటేశ్వర రావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్య - పరిశోధన వర్క్‌షాప్‌లో డీఈవో



నిజామాబాద్‌అర్బన్: పుదుచ్చేరిలో నిర్వహిస్తున్న విద్య - పరిశోధన వర్క్‌షాప్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. బడి బయటి పిల్లల నమోదు, మెరుగైన విద్య అందించేందుకు ప్రణాళికలు తదితర అంశాలపై మూడు రోజులపాటు వర్క్‌షాప్ కొనసాగుతుండగా, డీఈవో పాల్గొంటున్నారు.

క్రైం కార్నర్

హత్య కేసులో జీవిత ఖైదు

ఖలీల్‌వాడి: రిటైర్డ్ కానిస్టేబుల్ హత్య కేసులో మహిళకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి సునీత కుంచాల బుధవారం తీర్పునిచ్చారు. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన గంగామల్లుకు.. ఆమె ఇంటికి ఎదురుగా ఉండే రిటైర్డ్ కానిస్టేబుల్ రాంప్రసాద్‌కు గత కొన్నేళ్లుగా తగాదాలున్నాయి. వాహనాల పార్కింగ్ విషయంలో ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ఫిబ్రవరి 25న రాత్రి నిజామాబాద్ నుంచి ఖానాపూర్‌కు వస్తున్న రిటైర్డ్ కానిస్టేబుల్ రాంప్రసాద్‌ను ఖానాపూర్ శివారులో మాటువేసి వెనుక నుంచి బండ రాయితో మోది హత్య చేసింది. నిజామాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి గంగామల్లును జైలుకు తరలించారు. నిందితురాలి మీద పోలీసులు మోపిన అభియోగాలు రుజువుకావడంతో న్యాయస్థానం శిక్ష విధించింది.

బాలికపై అత్యాచారం కేసులో..

కామారెడ్డి క్రైం: బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు బుధవారం తీర్పునిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. 2023 మార్చి 8 న కామారెడ్డి మండలంలోని రామేశ్వర్‌పల్లికి చెందిన బాలకృష్ణ(40) చాక్లెట్లు ఇప్పిస్తానని ఓ చిన్నారిని ఊరి బయటకు బైక్‌పై తీసుకువెళ్ళి కల్లు తాగించి అత్యాచారం చేసి శివాలయం వద్ద వదిలి వెళ్లిపోయాడు. చిన్నారి కోసం వెతికిన కుటుంబ ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లగా స్పృహలోకి వచ్చిన తరువాత అసలు విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన దేవునిపల్లి పోలీసులు బాలకృష్ణను అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన కామారెడ్డి కోర్టు అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ నిందితుడికి జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు. కేసు విచారణ చేపట్టిన అప్పటి డీఎస్పీలు సురేశ్, నాగేశ్వర్‌రావు, సీఐ రామన్, ఎస్సైలు ప్రసాద్, రాజు, పీపీ శేషు, లైజనింగ్ అధికారి మురళి, కానిస్టేబుళ్లు బాలకృష్ణ, దేవిసింగ్‌ను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.

దూషించిన వ్యక్తికి మూడేళ్లు..

ఖలీల్‌వాడి: అప్పు తీసుకున్న కొడుకు తిరిగి చెల్లించలేదని తల్లిని దూషించిన కేసులో ఓ యువకుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ రెండో అడిషనల్ సెషన్స్ జడ్జి టి శ్రీనివాస్ బుధవారం తీర్పునిచ్చారు. రాందాస్ యువకుడి వద్ద నగరంలోని గాజుల్‌పేట్ ప్రాంతానికి చెందిన కార్తీక్ అప్పు తీసుకున్నాడు. తిరిగి చెల్లించకపోవడంతో 2023 ఆగస్టు 3న కార్తీక్ ఇంటికి వెళ్లిన రాందాస్.. అతడు ఇంట్లో లేకపోవడంతో తల్లి ఇందిరా బాయిని దూషిస్తూ తలుపులను తన్నడంతో ఆమె భయభ్రాంతులకు గురై రెండోటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి తగిన ఆధారాలు సమర్పించడంతో న్యాయస్థానం రాందాస్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధించింది.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రెంజల్(బోధన్): కందకుర్తి పుష్కర క్షేత్రంలోని గోదావరి నదిలో గుర్తు తెలియని యువకుని మృతదేహం లభించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. బుధవారం ఘాట్ పక్కన మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు సమాచారం అందించారని, జాలర్ల సాయంతో బయటికి తీయించామన్నారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 ఏళ్లు ఉంటుందని, బ్రౌన్ రంగు టీషర్టు, నీలి రంగు జీన్స్ ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. టీషర్ట్‌పై శంకర్ ఇంజినీరింగ్ కంపెనీ, నిజామాబాద్ అని ఉన్నట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

నవీపేట: మండలంలోని జన్నేపల్లికి చెందిన వల్లూరి సురేశ్ అనే వ్యక్తి ఇంట్లో దుండగులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సురేశ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి ఈనెల 10న హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటి ఆవరణను శుభ్రం చేసేందుకు వచ్చిన పనిమనిషి సుబ్బులు తాళం పగులగొట్టి ఉండడాన్ని గమనించి సురేశ్‌కు సమాచారం అందించింది. ఆయన హుటాహుటిన హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చాడు. నాలుగు తులాల బంగారు, 34తులాల వెండి ఆభరణాలతోపాటు రూ.30వేల నగదును దుండుగులు ఎత్తుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

ప్రేమ విఫలమైందని ఆత్మహత్య

- 15 రోజుల క్రితం పురుగుల మందు తాగిన యువకుడు
- పరిస్థితి విషమించి మృతి
- ఇందల్వాయి మండలం సిర్నాపల్లిలో ఘటన



అజయ్ (ఫైల్)

ఇందల్వాయి: ప్రేమ విఫలమైందని మనస్తాపంతో పురుగుల మందుతాగిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని సిర్నాపల్లి గ్రామానికి చెందిన హొన్నాజిపేట అజయ్(21) హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తి చేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. గ్రామానికి చెందిన ఓ యువతితో ప్రేమలో పడిన అజయ్.. చివరికి ప్రేమ విఫలం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 10వ తేదీన పురుగుల మందు సేవించాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలియనీయకుండా ఫుడ్ పాయిజన్ అయ్యిందని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రెండు వారాలు గడుస్తున్నా ఆరోగ్యం బాగుపడకపోవడంతో కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆస్పత్రిలో అజయ్ సెల్‌ఫోన్‌ను పరీక్షించగా అందులో పురుగుల మందు తాగుతూ తీసుకున్న వీడియో కనిపించడంతో కుటుంబ సభ్యులు బోరునవిలపించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు.

ఆరోగ్యం సహకరించక..



రాము(ఫైల్)

ఇందల్వాయి: ఆరోగ్యం సహకరించకపోవడంతో మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన చాకలి రాము(27) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. పదేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాము కాలువిరగడంతో రాడ్డు వేశారు. దీంతో ఏ పని చేయలేక నిస్సహాయ స్థిలో ఉన్న రాము జీవితంపై విరక్తి చెందిన ఈ నెల 20వ తేదీన తన పొలం వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా బుధవారం ఉదయం పరిస్థితి విషమించి మృతి చెందాడు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..



పల్లి అశోక్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): మద్యం సేవించేందుకు భార్య డబ్బులు ఇవ్వలేదని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని ఆరేడ్‌పల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పల్లి అశోక్(35) జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మద్యం సేవించేందుకు భార్య అనిత వద్ద రూ.150 తీసుకున్నాడు. సేవించి సాయంత్రం ఇంటికి వచ్చిన అశోక్.. మళ్లీ మద్యం కోసం డబ్బులు ఇవ్వాలని భార్యను అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో కోపంతో ఇంట్లోకి వెళ్లి తలుపులు పెట్టుకున్నాడు. గంట వరకు తలుపులు తీయకపోవడంతో అనుమానం వచ్చిన భార్య గ్రామస్తుల సహకారంతో తలుపులు తీయగా.. అశోక్ దులానికి ఉరేసుకొని చనిపోయాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పది నిమిషాల్లో రూ.4.69 లక్షలు మాయం



బాధితుడు భాస్కర్

గాంధారి(ఎల్లారెడ్డి): సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి బ్యాంకు ఖాతా నుంచి పది నిమిషాల వ్యవధిలో రూ.4.69 లక్షలు కాజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మాతు సంగెం గ్రామానికి చెందిన కమ్మరి భాస్కర్ గ్రామంలో వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇల్లు నిర్మించుకోవాలనే ఆలోచనతో తాను సంపాదించిన కొద్దిపాటి డబ్బులను యూనియన్ బ్యాంకు ఖాతాలో జమ చేశాడు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో తన భార్య అకౌంట్‌నుంచి తన అకౌంట్‌కు ఒక్క రూపాయి ట్రాన్స్‌ఫర్ చేసుకోగా, ఆ వెంటనే పది నిమిషాల్లో భాస్కర్ అకౌంట్ నుంచి మూడు విడతల్లో రూ.4.69 లక్షలు విత్‌డ్రా అయ్యాయి. అకౌంట్‌లో కేవలం రూ.108 నిలువ ఉన్నట్లు మెస్సేజ్ రావడంతో ఖంగుతిన్న బాధితుడు వెంటనే కామారెడ్డిలోని యూనియన్ బ్యాంకుకు చేరుకుని మేనేజర్‌కు విషయం తెలిపాడు. పరిశీలించిన బ్యాంకు అధికారులు.. అకౌంట్‌ను దుండగులు హ్యాక్ చేసి రూ.4.69 లక్షలు విత్‌డ్రా చేసినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్‌ఐఆర్ కాపీ తీసుకురావాలని భాస్కర్‌కు సూచించడంతో గాంధారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న డబ్బులు పోయాయని బాధితుడు రోదించాడు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇందల్వాయి: అక్రమంగా తరలిస్తున్న 7.73 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మండలంలోని గంగారాం తండాలో పట్టుకున్నట్లు సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆకుల మహేశ్‌కుమార్ తెలిపారు. బియ్యాన్ని సీజ్ చేసి వాహనాన్ని పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని, సెక్షన్ 6ఏ ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బాలికను వేధించిన వ్యక్తిపై కేసు

ఖలీల్‌వాడి: బాలికను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై మహేశ్ తెలిపారు. సునీల్ అనే వ్యక్తి ప్రేమ పేరుతో బాలికను వేధించడంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. బాలికలను వేధిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

బైక్ అదుపు తప్పి ఒకరు మృతి



రాములు మృతదేహం

బీబీపేట: బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బీబీపేటకు చెందిన సల్ల పెద్ద రాములు (34) బీబీపేట నుంచి జనగామ వైపు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తల, ముఖానికి తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సల్ల రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో పడి ఒకరు..

బిచ్కుంద(జుక్కల్): బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన మక్కె హన్మాండ్లు మూడు రోజుల క్రితం బహిర్భూమికని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఆయన తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. బుధవారం కమ్మరి చెరువు నీటిలో హన్మాండ్లు మృతదేహం తేలింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, హన్మాండ్లు ప్రమదవశాత్తు చెరువులో పడి మృతి చెందిఉండొచ్చని ఎస్సై పేర్కొన్నారు.